వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

## నేరం - శిక్ష

**పాతనీరు** పోయి కొత్త నీరు వచ్చినట్టుగానే సుమారు ఒకటిన్నర శతాబ్దాల కాలం నాటి నేరాలు, సాక్ష్యాలు, శిక్షల చట్టాలు పోయి, వాటి స్థానంలో కొత్త చట్టాలు వచ్చాయి. ఇప్పటిదాకా వ్యవహారంలో ఉన్న ఐపీసీ, సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ కాలగర్భంలో కలిసిపోయాయి. వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ అనే కొత్త చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. గత పార్లమెంటులో పెద్దగా చర్చ లేకుండానే వీటిని ఆమోదించడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆ సమయంలో అనేకమంది విపక్ష సభ్యులు సస్పెన్షన్‌కు గురై సభా కార్యక్రమాల్లో పాల్గొనలేకపోవడం గమనార్హం.

కొత్త చట్టాల్లోని అనేక నిబంధనలు ఆధునిక సాంకేతికతను ఒడిసిపట్టే విధంగా ఉండటం విశేషం. ఎలక్ట్రానిక్ పద్ధతిలో సమన్లు పంపడం, నేర ప్రదేశాల పరిశీలనను తప్పనిసరిగా వీడియో తీయడం, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదుల నమోదు, జీరో ఎఫ్ఐఆర్ వంటివి ఈ సందర్భంగా ఉదహరించవచ్చు. బాధితులకు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడం, అరెస్టయిన వ్యక్తి సూచించిన సంబంధీకులకు సమాచారం అందజేయడం వంటివి కూడా ఆహ్వానించదగిన మార్పులే. పోలీసుల ఇష్టారాజ్యానికి ఈ తరహా నిబంధనలు అడ్డుకట్ట వేస్తాయని చెప్పవచ్చు. నేరవిచారణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచే విధంగా ఈ నిబంధనలు రూపొందాయి. ఇదివరకు ఓ వ్యక్తి అరెస్టయితే ఆ వివరాలు తెలుసుకోవడం గగనంగా ఉండేది. కానీ, ఇప్పుడలా కాదు. అరెస్టు సమాచారం పోలీసు స్టేషన్‌లో, జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రముఖంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. మహిళలు, పిల్లలపై జరిగే నేరాల పరిశోధనకు కొత్త చట్టాల్లో ప్రాధాన్యమిచ్చారు. ప్రాథమిక దర్యాప్తు నివేదిక సమర్పించిన రెండు మాసాల్లోపు దర్యాప్తు పూర్తి చేయాల్సి ఉంటుంది. అదే విధంగా బాధితులకు ప్రతి 90 రోజులకు ఒకసారి కేసు పురోగతిని వివరించాల్సి ఉంటుంది. సామాజిక సేవను ఒక శిక్షగా గుర్తించడం ప్రశంసనీయమే. శిక్షలు విధించడం ఒక్కటే కాదు, న్యాయం చేయడమూ ముఖ్యమే అన్న సదుద్దేశంతో ఈ మార్పులు తెచ్చినట్టు ప్రభుత్వం చెప్పుకొన్నది.


అయితే కేంద్రం తెచ్చిన మార్పులన్నీ విమర్శలకు అతీతమైనవేమీ కావు. ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేసేందుకు 14 రోజుల సమయం పోలీసులకు ఇవ్వడం అభిలషణీయం కాదు. ఇలాంటి నిబంధనలు పోలీసులకు అపరిమితాధికారాలు కల్పించే ప్రమాదం ఉంటుంది. ఇకపోతే కాలంచెల్లిన రాజద్రోహ నేరం వంటివి తొలగించడం మంచి మార్పే. దాని స్థానంలో దేశ సార్వభౌమాధికారం, జాతీయ సమైక్యత, సమగ్రతకు ముప్పు తెచ్చే కార్యకలాపాలు అంటూ కొత్త నిర్వచనం తగిలించడంపై న్యాయవర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇది రాజద్రోహ నేరానికి మరింతగా విస్తృతార్థం కల్పించడం తప్ప మరొకటి కాదనే విమర్శలూ వినవస్తున్నాయి. ఇది ప్రజాఉద్యమాలు, హక్కులు, పోరాటాల అణచివేతకు దారితీసే ప్రమాదం ఎంతైనా ఉన్నది. వాక్‌స్వాతంత్ర్యానికి ప్రతిబంధకమైన నిబంధనలూ కొత్త చట్టాల్లో ఉన్నాయి. జాతి, కుల, మత వ్యత్యాసాల పేరిట మూకుమ్మడిగా జరిపే ప్రాణాంతక దాడుల విషయంలోనూ స్పష్టత లోపించింది. ఈ నేరానికి ఏడు సంవత్సరాల నుంచి యావజ్జీవం, ఆపై మరణశిక్ష దాకా విధించవచ్చని ఉంది. ఓ దాడిలో 50 మంది పాల్గొంటే అందరికీ మరణశిక్ష విధించడం కుదురుతుందా? అనేది ప్రశ్న.

163 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలకులు భారతీయ న్యాయవ్యవస్థపై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు తెచ్చిన నేరచట్టాల్లో 'థగ్గుల' నియంత్రణ, అసభ్యత వంటి అంశాలపై నేటి పరిస్థితుల్లో అర్థరహితంగా కనిపించే అనేక నిబంధనలు ఉండేవి. అలాంటివి తొలగించినప్పటికీ 80 శాతానికి పైగా నిబంధనలు పాతవాటిలో ఉన్నవే. చాలా పాత నిబంధనలు పేర్లు లేదా సంఖ్యలు మార్చుకుని కొత్త చట్టాల్లో కొత్త రూపంలో ఒదిగిపోయాయి. ఐపీసీలోని 420 సెక్షన్ కొత్త 'సంహిత'లో 318గా మారిపోయింది. కొత్త పేర్లు, సంఖ్యలకు అలవాటు పడటం న్యాయవృత్తిలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే అంశమే. పాతవి మరిచిపోయి కొత్తవి కంఠస్తం చేయడం న్యాయవాదులకు పరీక్షే. సర్దుబాటుకు కొంత సమయం పడుతుంది. కొత్త చట్టాలపై అవగాహనకు వర్క్‌షాపులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. బీజేపీ ప్రభుత్వ ఆచారం ప్రకారం కొత్త చట్టాలకు హిందీలో నోరు తిరగని పేర్లు పెట్టడంపై దక్షిణాదిలో, ముఖ్యంగా తమిళనాడులో అసంతృప్తి వ్యక్తమైనది. ఆ సంగతి అలా ఉంచితే ఆధునిక జీవన సరళి, కొంగొత్త సాంకేతికతకు అనుగుణమైన మార్పులు ప్రవేశపెట్టడం ప్రశంసనీయం.

### *పశ్చిమబెంగాల్‌లో తాలిబన్ల పాలన!*

***పశ్చిమబెంగాల్‌లో తాలిబన్ల పాలన నడుస్తున్నది. రాష్ట్రంలోని కూచ్‌బెహార్ నుంచి చోప్రా వరకు మూకదాడులు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలుపోలీసుల ముందే జరుగుతాయి. కానీ, వారు పట్టించుకోరు. మైక్రోస్కోప్ పెట్టి వెతికినా పోలీసులు మనకు కనిపించరు. ఎందుకంటే, రాష్ట్ర ప్రభుత్వంతో వారు చేతులు కలిపారు.***

***- సుకాంత మజుందార్,*** కేంద్రమంత్రి




# మొగులును చూడని మాగాణం కావాలె

> మృగశిర కార్తె పోయి ఆరుద్ర కార్తె నడుస్తున్నది. మరో మూడు రోజుల్లో పెద్ద పుశాల కూడా వస్తున్నది. నైరుతి రుతు పవనాలు ఈసారి ముందే వచ్చినా.. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు పడలేదు. మే నెలలో దంచికొట్టిన వానలు జూన్‌లో మోస్తరుగానే సరిపెట్టాయి. రాష్ట్రంలో సుమారు 16 జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతమే నమోదవుతున్నది. పల్లెల్లో 'వానదేవుడో.. వర్షదేవుడో..' అంటూ పిల్లలు కప్పతల్లి ఆటలు ఆడుతున్నారు. మహిళలు బొడ్రాయికి బిందెలతో నీళ్లు పోసి పూజలు చేస్తూనే ఉన్నారు. ఈ ఆరుద్ర పోతే ఆదెరువు పోయినట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే తుకాలు (వరి నారుమడులు) పోసుకోవడానికి ఇదే అనువైన సమయం. పెద్ద పుశాలలో విత్తనాలు ఎవరూ చల్లరు. పెద్ద పుశాలలో విత్తనాలు వేస్తే పెద్దలకు ముట్టినట్టేనని ఓ నానుడి.



**మారెడ్డి సంజీవ్ కుమార్**
91827 77465



ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షోభం అంచున ఉన్న వ్యవసాయాన్ని చూసి రైతులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. సర్కారు నుంచి అందాల్సిన వానకాలం పెట్టుబడి సాయం ఇంకా రానే లేదు. ఇప్పట్లో వస్తదనే నమ్మకమూ లేదు. అయినప్పటికీ అప్పులు తెచ్చి విత్తనాలు వేసిన రైతులు అవి మొలకెత్తేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. బిందెలతో నీళ్లు పోసి పంటలకు తడి అందిస్తూ కాలమైతదో కాదోనని కలవరపడుతున్నారు. కరువు కాటేస్తదేమోనని కంగారు పడుతున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కరువు బతుకులను కండ్లారా చూసిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రంలో ఆ పరిస్థితులు రావొద్దని కోరుకున్నారు. 'మొగులు (ఆకాశం)కు ముఖం పెట్టకుండా రైతులు వ్యవసాయాన్ని చేయాలి' అని సంకల్పించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన సమీక్షల్లో 'దక్కన్ పీఠభూమి అయిన తెలంగాణలో 90 శాతం రాతిపొరల నేలలే. పారకంపై కాకుండా నీటిని ఒడిసి పట్టి వ్యవసాయం చేయాలె' అని కేసీఆర్ తరచూ చేప్పేవారు. వరద నీటిని ఒడిసి పట్టాలని ముందుగా మైనర్ ఇరిగేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ తొలి కార్యక్రమంగా 'మిషన్ కాకతీయ'ను తీసుకున్నారు. దాదాపు రూ.5,249 కోట్లతో కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, చెక్‌డ్యామ్‌లను పునరుద్ధరించారు. కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో 23 రకాల పనులను నీటిపారుదల శాఖ పరిధిలోకి తీసుకువచ్చి కాలువల్లో పూడికతీతలు చేపట్టారు. ఇలా కేసీఆర్ దూరదృష్టితో చేపట్టిన పనుల వల్ల దేశంలో అత్యధికంగా మైనర్ ఇరిగేషన్ స్కీములు ఉన్న మొదటి 5 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన ఎంఐ 6వ సెన్సెస్ నివేదిక ప్రకారం... దేశంలో అత్యధికంగా యూపీలో 39.76 లక్షలు (17.2 శాతం), మహారాష్ట్రలో 35.73 లక్షలు (15.49 శాతం), మధ్యప్రదేశ్‌లో 22.85 లక్షలు (9.9శాతం), తమిళనాడులో 21.15 లక్షలు (9.1 శాతం) ఎంఐ స్కీములు ఉండగా, 16,79,868 (7.1 శాతం) ఎంఐ స్కీములతో తెలంగాణ 5వ స్థానంలో నిలిచింది. మైనర్ ఇరిగేషన్ మెరుగుపడి రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకున్నాక కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తిచేశారు. గోదావరి జలాలను ఎత్తిపోస్తూ.. తెలంగాణ నెత్తిన నీటి కుండలా కాళేశ్వరం ప్రాజెక్టును తీర్చిదిద్దారు. ఆపై ఈ ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులకు కరువు లేకుండా చేశారు. ఏటా డిసెంబర్, జనవరిలోనే చెరువులు, కుంటలను నింపి యాసంగి పంటకూ నీటికొరత రాకుండా చూశారు. రెండు పంటలకు నీళ్లు రావడంతో తెలంగాణ ఏర్పాటుకు ముందు 1.31 కోట్ల ఎకరాలు మాత్రమే ఉన్న సాగు విస్తీర్ణం 2.20 కోట్ల ఎకరాలకు పెరిగింది. భారీగా పెరిగిన సాగు విస్తీర్ణంతో భూమికి బరువయ్యేంత పంట దిగుబడి వచ్చింది. తొమ్మిదేండ్లలోనే తెలంగాణ దేశానికి అన్నం గిన్నెగా మారింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 11.6 శాతం వృద్ధిరేటు సాధించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానాన్ని ఆక్రమించింది. వ్యవసాయ రాష్ట్రాలైన మహారాష్ట్రలో 5.683 శాతం, మధ్యప్రదేశ్ 4.602 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 5.127 శాతం, పంజాబ్‌లో 0.811 శాతం మాత్రమే వృద్ధిరేటు నమోదైంది. దేశంలో విస్తీర్ణం, జనాభా పరంగా పెద్దవైన రాష్ట్రాలు కూడా తెలంగాణ దరిదాపుల్లో లేకపోవడం గమనార్హం.

> **ఉమ్మడి రాష్ట్రంలో కరువు బతుకులను కండ్లారా చూసిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రంలో ఆ పరిస్థితులు రావొద్దని కోరుకున్నారు. 'మొగులు (ఆకాశం)కు ముఖం పెట్టకుండా రైతులు వ్యవసాయాన్ని చేయాలి' అని సంకల్పించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన సమీక్షల్లో 'దక్కన్ పీఠభూమి అయిన తెలంగాణలో 90 శాతం రాతిపొరల నేలలే. పారకంపై కాకుండా నీటిని ఒడిసి పట్టి వ్యవసాయం చేయాలె' అని కేసీఆర్ తరచూ చేప్పేవారు.**

ఇంతటి ఘనత వహించిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వ్యవసాయం మళ్లీ నేల చూపులు చూస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. కేసీఆర్ హయాంలో పట్నం నుంచి పల్లెలకు వలసలు వెళ్తే.. కాంగ్రెస్ హయాంలో పల్లెల నుంచి పట్టణాలకు మళ్లీ వలసలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ ఆరు నెలల కాలంలోనే రైతులు అరిగోస వెళ్లదీశారు. యాసంగి ధాన్యం కొనుగోలు ఓ ప్రహసనంగా కొనసాగింది. ఎన్నికల హడావుడి వల్ల ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదని అనుకున్నా.. ఎన్నికల కోడ్ ముగిశాక కూడా అదే పరిస్థితి ఉంది. వానకాలం సీజన్ ప్రారంభంలో జనుము, జీలుగ, పచ్చిరొట్టె విత్తనాల కోసం కూడా రైతులు చెప్పులు, పాస్ పుస్తకాలు పెట్టాల్సిన దుస్థితి వచ్చింది. వడ్లకు బోనస్ ఇస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం సన్నాలకు మాత్రమే బోనస్ అంటూ రైతులను అయోమయంలో పెట్టింది.

> **ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తుకాలు పోసేందుకు ఇప్పటికే ఆలస్యమవుతున్నది. కాలం అదును దాటితే ఏ పంటలూ దిగుబడులు రావు. సాధారణంగా వరి పంట కాలం 120 నుంచి 145 రోజుల వ్యవధి ఉంటుంది. దొడ్డురకం వడ్లకు 120 రోజులు, సన్నరకం వడ్లకు 145 రోజుల సమయం పడుతుంది. ఇప్పటి నుంచి లెక్కగట్టినా సన్నరకాలను సాగు చేయాలంటే రైతులకు వరి పొట్టకొచ్చేసరికి వానకాలం అయిపోతుంది. ఆ సమయానికి వరి పంటకు తడి అందకుంటే దిగుబడి రాదు. పైగా దొడ్డు రకం వడ్లతో పోల్చితే సన్నరకం వడ్లకు తెగుళ్ల బెడద ఎక్కువ.. దిగుబడి తక్కువ.**

సమృద్ధిగా నీటి వసతి ఉన్న రైతులు మాత్రమే సన్నరకం వరిసాగు చేయడం ఉత్తమం. ఇప్పటికే మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటును సాకుగా చూపి లక్షల క్యూసెక్కుల నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం సముద్రంపాలు చేసింది. కాళేశ్వరం నుంచి ఒక్క ఎకరాకు సాగు నీరు అందించలేదని, అది ఎందుకు పనికి రాని ప్రాజెక్టు అని నోటికొచ్చినట్టు మాట్లాడిన కాంగ్రెస్ నాయకులకు మళ్లీ ఆ ప్రాజెక్టే దిక్కయింది.

తాజాగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు కొండపోచమ్మసాగర్ నుంచి రెండు టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఎగువ నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో ఆయకట్టు రైతుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో వరినాట్లు అయినా, వరికోతలైనా నిజామాబాద్ జిల్లా రైతులే మొదటగా ప్రారంభిస్తారు. అన్ని రకాలుగా ముందుండే నిజామాబాద్ రైతులే వరినాట్లకు నానా అగచాట్లు పడుతున్నారంటే.. రాష్ట్రంలో ఇతర జిల్లాల రైతుల పరిస్థితి వేరే చెప్పాల్సిన పనిలేదు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో కరువు ఛాయలు అలుముకున్నట్టే. గత డిసెంబర్, జనవరి నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటలను నింపి ఉంటే వానకాలం వ్యవసాయంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేది. అందుకే మొగులును చూడని మాగాణాన్ని సృష్టించినపుడే రైతు రాజవుతాడు.

### లేఖలు

### *అర్హులందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలె!*

*ఆర్థికంగా వెనుకబడిన రైతులకు అండగా ఉండాలనే లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన పథకం 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి'. అర్హులైన అనేకమంది రైతులకు ఈ పథకం అందడం లేదు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి కొత్త లబ్ధిదారులను చేర్చకపోవడంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు పెట్టుబడి సాయాన్ని అందుకోలేకపోతున్నా రు. రైతులకు సంబంధించిన పథకం కాబట్టి లబ్ధిదారుల ఎంపికను నిరంతర ప్రక్రియగా చేపట్టాలె. అప్పుడే అర్హులందరికీ ప్రయోజనం చేకూరుతుంది.*

*'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' పథక రూపకల్పన సమయంలో 2018 కంటే ముందు పట్టాదారు పాసు పుస్తకాలున్న రైతులు మాత్రమే అర్హులుగా పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు వారికే పెట్టుబడి సాయం అందుతున్నది. 2018 తర్వాత నమోదైనవారికి ఆ పథకం కింద పెట్టుబడి సాయం అందటం లేదు. కాబట్టి ఈ పథకానికి అర్హులైన రైతులను లబ్ధిదారుల జాబితాలో చేర్చాలి. అంతే కాకుండా, ఏడాదికి రూ.6000గా ఉన్న సాయాన్ని రూ.10 వేలకు పెంచాలి. సాగు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి సాయాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.*


***- గుండమల్ల సతీష్ కుమార్***

> ప్రభుత్వ విద్యుత్ సంస్థలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో విక్రయించినా విస్తుపోవాల్సిన పని లేదు. ఈ మాట ఇప్పుడెందుకు అంటున్నానంటే రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలను నిర్వహించేవారు కరువైనట్టు, ఆ బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు అదానీ, ఆయన సంస్థల మీద చేసిన అనేక ఆరోపణలను మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, స్వయానా రేవంత్ రెడ్డి కూడా గతంలో అదానీపై అనేక ఆరోపణలు చేసిన విషయం మనకు తెలిసిందే.

# అదానీకి అమ్మడం వెనుక..



**అశోక్ ధనావత్**



పదేండ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను గాలికివదిలేసి, ప్రపంచవ్యాప్తంగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ లాంటి పారిశ్రామికవేత్తకు రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలను అమ్మచూడటం ఆక్షేపణీయం. తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ సంస్థల బాధ్యతను, ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించే కార్యకలాపాలను అదానీ సంస్థకు కట్టబెట్టడం ఏ కోశానా మంచిది కాదు. పాతబస్తీలో పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలను వసూలు చేయడం కోసమే అదానీకి కట్టబెట్టినట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ దీనివెనుక అతిపెద్ద కుట్ర దాగి ఉన్నదనే విషయం అర్థమవుతున్నది. విద్యుత్ బకాయిలను తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ ఉద్యోగులు వసూలు చేయలేరా? అండర్ గ్రౌండ్ (భూగర్భ) విద్యుదీకరణ కోసమే అదానీకి కట్టబెట్టామని చెప్తున్నది. కానీ, ప్రభుత్వరంగ సంస్థ తెలంగాణ విద్యుత్ కార్పొరేషన్ ఉద్యోగులు కూడా అండర్‌గ్రౌండ్ పనిని సమర్థవంతంగా చేయడానికి సిద్ధంగా ఉన్నారు. వీరిని పక్కనబెట్టి యుద్ధ ప్రాతిపదికన తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ పనులను అదానీ సంస్థకు అప్పగించాల్సిన అవసరం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందో అంతుచిక్కడం లేదు. కాంట్రాక్టు పనులను అదానీ కంపెనీలకు కాంట్రాక్టు ఇచ్చి, వాటి ద్వారా వచ్చే కమీషన్ కోసమే రేవంత్ పాకులాడుతున్నట్టు కనబడుతున్నది. పాత బకాయిల వసూలు పేర పాతబస్తీ పౌరుల మీదికి ఉద్దేశపూర్వకంగా అదానీ కంపెనీని రేవంత్ ప్రభుత్వం ఉసిగొల్పుతున్నట్టుగా కనపడుతున్నది.

విద్యుత్ ప్రభుత్వరంగ సంస్థలను అదానీ కంపెనీకి కట్టబెట్టడాన్ని రాష్ట్రంలోని ప్రజలందరూ అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇది కేవలం పాతబస్తీకి పరిమితమయ్యే విషయం కాదు. తెలంగాణలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేసే కుట్రలో భాగంగానే దీనంతటినీ చూడాలి. ఇదిలా ఉంటే రాష్ట్ర గనులను ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి కట్టబెట్టకుండా ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు విశ్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ ప్రభుత్వం చేసే పనులను ఖండించకుండా చూస్తూ ఊరుకుంటే రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్న ది. తెలంగాణ రాష్ట్ర ప్రజల వనరులను అదానీ సంస్థలకు కట్టబెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. రాష్ట్రం తెచ్చుకున్నది ప్రజల సంక్షేమం కోసమే కానీ, ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. తెలంగాణ తెచ్చుకున్నది కాంట్రాక్టు కమీషన్ల కోసం కాదనే విషయాన్ని కూడా ప్రభుత్వం గ్రహిస్తే మంచిది.

**(వ్యాసకర్త: రీసెర్చర్, నేషనల్ క్యాంపైన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్)**

# రిజర్వేషన్లు బీసీల రాజ్యాంగ హక్కు



**అవనిశ్రీ**
99854 19424

కొందరికి డబ్బు, ఇంకొందరికి కులం, మరికొందరికి రిజర్వేషన్ల ద్వారా రాజ్యాధికారం సాధ్యపడుతుంది. అయితే కింది వర్గాలు కనీసం గ్రామీణ స్థాయిలోనైనా అధికార పీఠాన్ని ఎక్కాలంటే మాత్రం రిజర్వేషన్లే పెద్దదిక్కు. కానీ, ఎలాంటి రిజర్వేషన్లు కూడా కింది సామాజిక వర్గాలకు సరైన న్యాయం చేయడం లేదు. గ్రామీణ స్థాయిలో అనేక రకాల సమస్యలు వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుండటమే అందుకు కారణం.

రాజ్యం ఎవరి చేతుల్లోకి రాత్రికి రాత్రే వచ్చి వాలిపోదు. దాని వెనుక ఎన్నో పోరాటాలు, ఎంతో మేధోమథనం జరిగి.. పునాదుల నుంచి కదిలొస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుంది. ఇదంతా కేవలం భూస్వాములుగా చెలామణిలో ఉన్న అగ్రవర్ణాలకు కలిసొస్తున్నాయి. అదే బీసీ సామాజిక వర్గాల్లో చైతన్యం రావాలంటే.. నాయకుల మీద నమ్మకం తక్కువ ఉండి విమర్శ ధోరణి ఎక్కువ ఉంటుంది.రాజకీయ చైతన్యం వచ్చినప్పటికీ పల్లెల్లో ఆధిపత్య సమాజం కింద నలిగిపోయే బీసీ సమాజం ఉండటం అడ్డంకిగా మారుతున్నది. రిజర్వేషన్ ఉంటేనే గ్రామాల్లో పోటీ చేయడానికి అర్హత ఉంటుంది. లేదంటే జనరల్ సీట్‌లో కనీసం పోటీ చేయాలని కూడా ఊహించలేం. మరికొన్ని గ్రామాల్లో రిజర్వేషన్ ఉన్నప్పటికీ ఆధిపత్య వర్గాల చేతికింది మనిషికి టికెట్ ఇప్పించి, వాళ్ల చెప్పుచేతల్లో పెట్టుకొని రాజ్యమేలే వర్గాల పెత్తందారితనం ఇంకా నడుస్తున్నది.

రాష్ట్రంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కొన్ని హామీలనిచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం.. రిజర్వేషన్లు ఇవ్వడం వాటిలో ఒకటి. అయితే దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలంటే కులగణన చేసి తీరాల్సిందే. లేదంటే బీసీ సమాజం పెద్ద ఎత్తున నష్టపోతుంది.ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం కచ్చితంగా ఇవ్వాలనేది రాజ్యాంగంలో ఉన్నది. 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదనేది సుప్రీంకోర్టు విధానం. ఇప్పుడు కులగణన చేసి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలంటే సుప్రీంకోర్టు లైన్‌ను దాటాల్సిందే.గతంలో కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ సీలింగ్‌ను బ్రేక్ చేస్తూ.. 10 శాతం రిజర్వేషన్లను కొత్తగా ఇచ్చింది. దీని వలన సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధన కచ్చితంగా పాటించవలసిన అవసరం లేదని తెలిపోయింది. పై వర్గాలకు రిజర్వేషన్ ఫలాల కోసం ఏ ఉద్యమం కూడా జరగలేదు. రాత్రికి రాత్రే ఈడబ్ల్యూఎస్ కోటా గెజిట్‌లో ప్రత్యక్షమైంది. చట్టం చేసే హక్కు తమ చేతుల్లో ఉండటమే అందుకు కారణం.

జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో 60 శాతానికి పైగా రిజర్వేషన్లు ఉన్నాయి. గతేడాది బీహార్ ప్రభుత్వం కులగణన జరిపి.. ఓబీసీ, ఎంబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లను పెంచింది. ఆయా రాష్ట్రాలలో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి 75 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అయితే రిజర్వేషన్లు తగ్గించే అధికారం రాష్ట్రానికి ఉంటుంది కానీ, పెంచే అధికారం కేంద్రప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. అందుకే బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామనే కాంగ్రెస్ హామీ సత్యదూరమే అనడంలో సంశయం అక్కర్లేదు.

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల తర్వాత హేయంగా బతుకుతున్నది ఎవరైనా ఉన్నారంటే అది బీసీ సామాజికవర్గానికి చెందినవారే. కొన్ని కులాలు దళితుల కంటే దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నాయి. రాష్ట్రంలోని వందకు పైగా బీసీ కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను లెక్కగట్టి.. వాళ్ల జీవన విధానాన్ని బయటకు తీస్తేనే సరైన ఆధారాలు లభిస్తాయి. లేదంటే మరొకసారి తీరని అన్యాయం జరుగుతుంది. అందుకే మన అణగారిన వర్గాల ప్రజలు చట్టాలు చేసే అసెంబ్లీలో, పార్లమెంటులో ఉంటేనే మనకు రాజ్యాంగ ఫలాలు దక్కుతాయి. తద్వారా రేపటి తరాలు రాజ్యాధికారాన్ని అనుభవిస్తాయి.